క్లుప్తంగా

అమోర్‌ హాస్పిటల్స్‌ ఆధ్వర్యంలో వాకథాన్‌.. అవగాహన ర్యాలీ



వాకథాన్‌లో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

కూకట్‌పల్లి: వరల్డ్‌ హార్ట్‌డే సందర్భంగా నగరంలోని ప్రముఖ ఆరోగ్య సేవా సంస్థ అమోర్‌ హాస్పిటల్స్‌ శనివారం వాక్‌థాన్‌, కార్డియో అవగాహన శిబిరాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచటం, ఫిట్‌నెస్‌ను జీవనశైలిగా ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఉదయం 6 గంటలకు అమోర్‌ హాస్పిటల్స్‌ నుంచి ప్రారంభమైన వాక్‌థాన్‌ ఐడీఎల్‌ లేక్‌ రోడ్డు మార్గంగా 5 కిలోమీటర్ల దూరం నుంచి తిరిగి హాస్పిటల్‌ క్యాంపస్‌ వద్ద ముగిసింది. కార్యక్రమంలో అమోర్‌ హాస్పిటల్స్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కిషోర్‌ బి రెడ్డి మాట్లాడుతూ.. వరల్డ్‌ హార్ట్‌ డే మనకు చికిత్స ఎంత ముఖ్యమో నివారణ కూడా అంతే ముఖ్యమని అన్నారు. వాకథాన్‌ అనంతరం అమోర్‌ హాస్పిటల్స్‌ ప్రాంగణంలో కార్డియో అవగాహన శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిబిరంలో ఉచిత కన్సల్టేషన్లు, కార్డియాలజిస్టులతో ఇంటరాక్టివ్‌ సెషన్లు ఏర్పాటు చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌ హనుమాన్‌ నగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని బీజేపీ సీనియర్‌ నాయకుడు ఎనుగుల తిరుపతి అన్నారు. శనివారం కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలపై అధికారులతో మాట్లాడారు. ఎంపీ ఈటల రాజేందర్‌ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో హర్జీత్‌ సింగ్‌, సందీప్‌ అసోసియేషన్‌ సభ్యులు రాజు, మల్లేష్‌, బాలరాజు, శిరీష్‌, శ్రీధర్‌, ఎల్లేష్‌, కనకయ్య, మహేష్‌, మల్లేష్‌, యశ్వంత్‌ తదితరులు పాల్గొన్నారు.

దసరా వేడుకలకు అన్ని ఏర్పాట్లు

- కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌

ఆల్విన్‌కాలనీ: అంబీర్‌ చెరువు కట్ట మీద బతుకమ్మ, దసరా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులో ఉన్న గుర్రపు డెక్కను తొలగించే పనులు చేస్తామన్నారు. ఉత్సవాలు జరిగే ప్రాంగణాన్ని, పరిసర ప్రాంతాలను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు శివమ్మ కాలనీ, రామాలయం దగ్గర, అంబీర్‌ చెరువు కట్టపై బతుకమ్మ వేడుకలు, అక్టోబర్‌ 02న సాయంత్రం 6 గంటలకు దసరా ఉత్సవాలు నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నేడు భరత్‌నగర్‌ కాలనీ అసోసియేషన్‌ ఎన్నికలు

మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీ అసోసియేషన్‌ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. కాలనీలోని పార్కులో ఉన్న గ్రంథాలయం భవనంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్‌ ఉంటుంది. అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు.రెండు ప్యానల్స్‌ పోటీలో ఉన్నాయి. సుమారు 640 ఓట్లు ఉన్నాయి.



లలితా దేవిగా మూసాపేటలోని రేణుకా ఎల్లమ్మ అమ్మవారు



మోతీనగర్‌లో శంకర మఠంలో ఇంద్రాణి అలంకరణలో ..




అవంతినగర్‌ తోట నల్ల పోచమ్మ వద్ద పూజలో గోపిశెట్టి రాఘవేందర్‌ తదితరులు

ప్రమాదకరంగా..

- శిథిలావస్థలో ఆల్విన్‌కాలనీ పైపులైన్‌ రోడ్డు బ్రిడ్జి
- వందలాది వాహనాల రాకపోకలు
- కొత్త బ్రిడ్జి నిర్మించాలి.. వాహనదారులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ పైపులైన్‌ రోడ్డు బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. ప్రమాదకరంగా మారడంతో కొత్త బ్రిడ్జిని నిర్మించాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు. కనీసం మరమ్మతులైనా నిర్వహించాలని కోరుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలోని ఆల్విన్‌కాలనీ పైపులైన్‌ రోడ్డులోని ఎస్‌ఎస్‌డీ స్కూల్‌ సమీపంలోని నాలాపై ఉన్న బ్రిడ్జి సుమారు 4 దశాబ్దాల క్రితం నిర్మించారు. దీనిపై రోజూ వందలాది వాహనాలు ప్రయాణించాయి. ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవటంతో దీనిని ఆనుకుని మరో బ్రిడ్జి నిర్మించారు. నూతనంగా బ్రిడ్జి నిర్మించి పాత బ్రిడ్జి, కొత్త బ్రిడ్జిని కలుపుతూ వన్‌వేగా రహదారిపై వాహనాల రాకపోకలు సాగించేలా సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. కానీ పాత బ్రిడ్జికి మరమ్మతులు చేయకుండా వదిలివేయటంతో అది ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిపై భారీ గుంతలు



ఏర్పడి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బ్రిడ్జిపై ఉన్న బీటీ రోడ్డు కొట్టుకుపోయింది. రోజు బ్రిడ్జిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్రిడ్జి గోడలు పడిపోయేలా ఉన్నాయి. సంబంధిత అధికారులు నామమాత్రంగా ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. ఈ రహదారిపై కుత్బుల్లాపూర్‌, కూకట్‌పల్లి సర్కిళ్ల నుంచి ద్విచక్ర వాహనాల నుంచి భారీ వాహనాల వరకు రాకపోకలు సాగించేందుకు ఉన్న రహదారి ఈ బ్రిడ్జినే. రాత్రింబవళ్లు జీడిమెట్లలోని ఇండస్ట్రీ ప్రాంతానికి రా మెటీరియల్‌ తీసుకువెళ్లటానికి పదుల సంఖ్యలో పెద్ద వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.వాహనాల తాకిడికి బ్రిడ్జి ఊగుతోందని స్థానికులు, ప్రయాణికులు భయపడుతున్నారు. గతంలో ఈ బ్రిడ్జికి బదులుగా నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. నూతన బ్రిడ్జి నిర్మించిన తరువాత పాత బ్రిడ్జి స్థానంలోనే మరో కొత్త బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. అయితే బ్రిడ్జి ఇరువైపులా నగరానికి తాగునీటిని సరఫరా చేసే భారీ మంచి నీటి పైపులైన్‌లు ఉన్నాయి. జలమండలి, జీహెచ్‌ఎంసీ మధ్య సమన్వయం లేక బ్రిడ్జి నిర్మాణం కాలేదని పలువురు అంటున్నారు. పాత బ్రిడ్జి స్థానంలో బ్రిడ్జిని నిర్మించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.







ఆల్విన్‌కాలనీ పైపులైన్‌ రోడ్డులో గుంతలమయంతో ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి

శ్రీశైలంలో వసతిగృహం ప్రారంభించిన ఎమ్మెల్యే



వసతిగృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌రావు

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శ్రీశైలం మల్లికార్జున భ్రమరాంబ ఆలయంలో తన తండ్రి కీర్తిశేషులు మాధవరం శివయ్యగారి నారాయణరావు పేరు మీద కట్టించిన నూతన వసతి గృహాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి పేరు మీద ఈ వసతి గృహాన్ని కట్టించి దేవస్థానానికి అందించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్‌ బాపూజీ



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: బడుగు, బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొండా లక్ష్మణ్‌ బాపూజీ అని పీఏసీ చైర్మన్‌ గాంధీ అన్నారు. 110వ జయంతి పురస్కరించుకొని ఆల్విన్‌కాలనీ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్‌ బాపూజీ జీవితం నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. బహుజన నేతగా ఆయన దేశవ్యాప్తంగా పద్మశాలీలను సంఘటితం చేసిన ఘనత కొండా లక్ష్మణ్‌ బాపూజీకే దక్కిందని తెలిపారు. అదేవిధంగా కూకట్‌పల్లి జోనల్‌ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలేసి అధికారులు, సిబ్బంది



కూకట్‌పల్లి జోనల్‌ కార్యాలయంలో..

నివాళి అర్పించారు. కార్యక్రమంలో రఘునాథ్‌ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివా స్‌ యాదవ్‌, రామకృష్ణగౌడ్‌, గణేష్‌, ఖరీం, భిక్షమయ్య, ఆంజనేయులు, ప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో మేలు

- ఎంపీ ఈటల రాజేందర్‌

కూకట్‌పల్లి: ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం వల్ల వినియోగదారులకు, వ్యాపారులకు మేలు జరుగుతుందని ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. కూకట్‌పల్లి వై జంక్షన్‌ వద్ద ఉన్న పలు వ్యాపార సంస్థల మోటార్‌ వెహికల్స్‌ షోరూమ్‌లను సందర్శించారు. డీలర్స్‌, కస్టమర్‌లతో మాట్లాడి జీఎస్‌టీ తగ్గదల వల్ల కలిగే లాభాలను తెలుసుకున్నారు. వాహనాల ధరలు తగ్గడం వల్ల సాధారణ కుటుంబాలు కూడా సులభంగా వాహనాలను కొనుగోలు చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కార్పొరేటర్‌ కొడిచెర్ల మహేందర్‌ పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌ వనరులను వినియోగించుకోవాలి

ఆల్విన్‌కాలనీ: పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు అందుబాటులో ఉన్న సౌర విద్యుత్‌ వనరులను వినియోగించుకోవాలని నిపుణులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం, అవగాహన సదస్సు వివేకానందనగర్‌ కాలనీలో శనివారం నిర్వహించారు. అనంతరం స్కీమ్‌ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీఆర్‌ఈడీసీఓ జిల్లా అధికారి పవన్‌ చందు, టీజీఎస్‌పీడీసీఎల్‌ కూకట్‌పల్లి ఏఈ చైతన్య, ఆల్విన్‌కాలనీ ఏఈ పీర్యా నాయక్‌ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రధాన మంత్రి సూర్యఘర్‌ ముఫ్త్‌ బిజిలి యోజన, పీఎం కుసుమ్‌ యోజన, బయోగ్యాస్‌, సోలార్‌ పథకాలు వంటి పథకాల ద్వారా సౌర విద్యుత్‌ వినియోగం పెంపొందుతుందని తెలిపారు. పవన్‌చందు మాట్లాడుతూ.. పీఎం సూర్యఘర్‌ యోజనలో భాగంగా సోలార్‌ రూఫ్‌ టాప్‌లు ఏర్పాటు చేసుకున్న గృహ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఈ పథకం వల్ల గృహ విద్యుత్‌ ఖర్చు గణనీయంగా తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ ఆఫీసర్‌ ఓం ప్రకాష్‌, సిబ్బంది, కూకట్‌పల్లి నగర వాసులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌ అధికారులు

నైపుణ్యాలు నేర్చుకోవాలి

రాయదుర్గం: చదువుతోపాటు నైపుణ్యాలు నేర్చుకుంటే భవిష్యత్తులో ఉపయోగపడతాయని 'టీహబ్‌' సీఈఓ కవికృత్‌ అభిప్రాయపడ్డారు. శనివారం గచ్చిబౌలి ఇండియన్‌ స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌ (ఐఎస్‌బీ) తన ఐ-వెంచర్‌ ఇమ్మర్సివ్‌ (ఐవిఐ) ప్రోగ్రామ్‌ రెండవ కోహర్ట్‌ గ్రాడ్యుయేషన్‌ కార్యక్రమంలో 50 స్టార్టప్‌లు ఆరుమాసాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కవికృత్‌ మాట్లాడుతూ అనుభవం నుంచి వ్యవస్థలను సృష్టించడం, నమూనాలను గుర్తించడం, ప్రతిభావంతులైన బృందాలను సమీకరించడం నాన్‌ లీనియర్‌ వృద్ధికి ఎలా తీస్తుందో ఆయన గుర్తుచేశారు. ఐఎస్‌బీ డీన్‌ ప్రొ.మదన్‌ పిల్లుట్ల మాట్లాడుతూ భారతదేశం పురోగతికి, తాజా ఆలోచనలు, విధానాలు చాలా ముఖ్యమైనవన్నారు.

సేవలపై ట్రైనీ ఐపీఎస్‌లకు అవగాహన

కేపీహెచ్‌బీకాలనీ: పోలీస్‌ సేవలపై అవగాహన కల్పించడంతో పాటు సగటు ఫిర్యాదుదారుడికి పోలీస్‌ స్టేషన్‌లో అందే సేవలను ట్రైనీ ఐపీఎస్‌లకు సైబరాబాద్‌ సీపీ అవినాష్‌ మహంతి వివరించారు. కూకట్‌పల్లి హౌసింగ్‌ బోర్డు పోలీస్‌స్టేషన్‌ను శనివారం సాయంత్రం కమిషనర్‌తో పాటు పోలీస్‌స్టేషన్‌లో సేవలను పరిశీలించేందుకు వచ్చిన నేషనల్‌ పోలీస్‌ అకాడమీ జాయింట్‌ డైరెక్టర్‌, సీబీఐ జాయింట్‌ డైరెక్టర్‌, నలుగురు ట్రైనీ ఐపీఎస్‌లతో కలిసి క్షేత్ర స్థాయి విధులపై అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఫిర్యాదుదారుడికి ప్రాథమిక దశలో అందే సేవలను మొదలుకొని ఫిర్యాదుపై స్పందించే తీరు దర్యాప్తు స్థితిగతులను చర్చించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయి విధులపై పోలీస్‌ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.



అవగాహన కల్పిస్తున్న సీపీ అవినాష్‌ మహంతి

నేడు విజయ దశమి ఉత్సవం

సాక్షి, సిటీబ్యూరో: ఆర్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పరిధిలోని రాంనరేష్‌ నగర్‌ కమ్యూనిటీ హాలులో ఆదివారం ఉదయం 'విజయ దశమి' ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హోలిస్టిక్‌ హాస్పిటల్స్‌ చైర్మన్‌ డాక్టర్‌ వి.ఎస్‌ రామచంద్ర, ముఖ్య వక్తగా ఆర్‌ఎస్‌ఎస్‌ సీనియర్‌ కార్యకర్త డాక్టర్‌ మంచూరి అమర్‌నాథ్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం అన్నవితరణ, మాతృమూర్తులకు తాంబూల ప్రదాన కార్యక్రమాలు ఉంటాయని, హిందూ బంధువులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

రామ రామ ఉయ్యాలో..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లిలో మహిళలు, యువతులు బతుకమ్మలను ఒక వేదిక వద్దకు చేర్చి రామ రామ ఉయ్యాలో అంటూ పాట పాడారు. ఆడుతూ, పాడు తూ సందడి చేశారు. సాంప్రదాయ దుస్తు లు ధరించిన మహిళలు, యువతులు బతు కమ్మల వద్ద ఆటా, పాటలతో ఆకట్టుకున్నా రు. కొలనులలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



కూకట్‌పల్లిలోని హనుమాన్‌ ఆలయం వద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



బతుకమ్మతో..



వివేకానంద డిగ్రీ కళాశాలలో..





వెంకట్రావ్‌నగర్‌ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కూకట్‌పల్లి రామాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నేత్రపర్వం.. నవరాత్రోత్సవం

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో దసరా నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మహిళలు కుంకుమార్చనల్లో పాల్గొన్నారు.

– కూకట్‌పల్లి(జోన్‌బృందం)



అమ్మవారి పూజలో ఎంపీ ఈటల రాజేందర్‌, కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు



అంజయ్యనగర్‌లోని అమ్మవారి పూజలో ..



హస్మత్‌పేటలోని అమ్మవారి వద్ద ఉప ముఖ్యమంత్రి సతీమణి బట్టి నందిని తదితరులు